క్లుప్తంగా

హనుమాన్ దీక్ష ప్రారంభం



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా హనుమాన దీక్ష సోమవారం ప్రారంభించారు. సుమారు 50 మంది భక్తులు మాలధారణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాధవ శంకర్ మాట్లాడారు. మాలధారులు నిష్టగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బొద్దుల దివాకర్ త్రివేణి, ఆకుల ప్రభాకర్, మల్యాల రాజు, శింగిరికొండ రజని, స్రవంతి, ఇమ్మడి పద్మ, ఇరుకుల్ల రజిత, కొడకండ్ల కుసుమకుమారి, దుబ్బా శ్రీదేవి, ఆలయ గుమస్తా దేశీరామ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : ఉద్యోగ విరమణ సందర్భంగా చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడు బొమ్మనపల్లి నాగేశ్వరచారిని సోమవారం ఎంఈఓ సరళ, పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సతీసమేతంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సరళ మాట్లాడారు. నాగేశ్వరచారి సుమారు 3 దశాబ్దాలపాటు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించారని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్‌మోహన్, వెంకటేశ్వర్‌రావు, సరిత, శైలజ, అశోక్, అనిత, భిక్షపతి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



నర్సంపేట : వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్ విద్యార్థి నాడెం తేజ ప్రతిభ చాటినట్టు స్కూల్ చైర్మన్ రమేశ్ తెలిపారు. స్కూల్ ఆవరణలో విద్యార్థిని ప్రిన్సిపాల్ నవితతోపాటు చైర్మన్ రమేశ్ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేశ్ మాట్లాడారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చీఫ్ అడ్వైజర్ జ్యూరీ, చీఫ్ కోఆడిటర్ అశోక్‌కుమార్, కన్వీనర్ యాకూబ్ పాషా పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో స్కూల్ కరాటే మాస్టర్ షేక్ జానీ సహకారంతో విద్యార్థి తేజ కటాఫ్ ఈవెంట్స్ విభాగంలో రెండు గంటల పాటు ప్రాక్టీస్‌లో ప్రతిభ కనబర్చారని చెప్పారు. స్కూల్ కరాటే కోచ్ షేక్ జానీకి ఉత్తమ శిక్షకుడిగా అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

'బీజేపీ అసత్య ప్రచారం'

పర్వతగిరి : కేంద్ర ప్రభుత్వమే సన్నబియ్యం ఇస్తోందంటూ బీజేపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా సన్నబియ్యం పంపిణీకి నిర్ణయించిందని చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు.

గీత కార్మికుడి మృతి



అనిల్ (ఫైల్)

వర్ధన్నపేట : తాటిచెట్టు నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని నల్లబెల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనిల్ (35) ఆదివారం తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. గాయాలపాలైన ఆయన్ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తలకొరివి పెట్టిన కుమార్తె

అనిల్‌కు కుమారులు లేకపోవడంతో ఆయన మృతదేహానికి కూతురు (బాలిక) తలకొరివి పెట్టింది. కుమార్తె తలకొరివి పెట్టాల్సి వచ్చిందంటూ మృతుడి బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

మాజీ సర్పంచ్...

నల్లబెల్లి : స్థానిక మాజీ సర్పంచ్ గుండాల నర్సయ్య (98) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఎంసీపీఐ(యూ) నాయకులు కొమురయ్య, వెంకటయ్య, ముదిరాజ్ సంఘం నాయకుడు సాంబయ్య, తదితరులు నివాళులర్పించారు. నర్సయ్య మృతదేహానికి ఎంసీపీఐ(యూ), సీపీఎం నాయకులు ఎర్ర జెండాలు కప్పి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ రాజారాం, ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి సాంబయ్య, సీపీఎం మండల కార్యదర్శి మనోహర్ నివాళులర్పించారు.

పల్లెల్లో వీధి కుక్కల బెడద

- గ్రామస్తుల బెంబేలు
- పలువురు ఆస్పత్రుల పాలు



గాయపడిన ఆకులతండా వాసులు (ఫైల్)

నర్సంపేట రూరల్ : మండలంలోని పల్లెల్లో నానాటికీ వీధికుక్కల బెడద పెరుగుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, చిన్నారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. నియంత్రణ లేకపోవడంతో కుక్కలు గుంపులుగా తిరుగుతూ బాటసారులు, ప్రయాణికులతోపాటు ఇళ్లలో ఉన్న వారిపైనా దాడి చేస్తున్నాయి. పలువురు ఆస్పత్రుల పాలైన ఘటనలూ కోకొల్లలు.

నియంత్రణకు కృషి చేస్తాం



గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు కృషి చేస్తాం. వీధి కుక్కల సంతతిని నియంత్రించేలా పశు వైద్యాధికారులు శస్త్రచికిత్స చేసేలా చర్యలు తీసుకుంటాం. గతంలో కుక్కల బెడద తలెత్తిన సందర్భాల్లో పలు గ్రామాలకు చెందిన కుక్కలను పట్టించి అడవుల్లో వదిలేశాం.

- శ్రీనివాసరావు, ఎంపీడీఓ

నర్సంపేట మండల పరిధిలో 19 గ్రామాలున్నాయి. ఆకులతండా, ఇటుకాలపల్లి గ్రామాలకు చెందిన 11 మందిని ఓ కుక్క జనవరి 11న కరిచింది. ఆకులతండా గ్రామస్తులు కుక్కను తరిమితే అది పక్కనే ఉన్న ఇటుకాలపల్లికి వెళ్లి అక్కడి నుంచి ఆకులతండాకు వెళ్లి పలువురిపై దాడి చేసింది. కుక్క దాడిలో ఆకుల తండాకు చెందిన చిన్నారి తీవ్ర గాయాల పాలైంది. క్షతగాత్రులను నర్సంపేట ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు పంపించారు. అలాగే గురిజాలలో గత నెలలో ఓ వృద్ధురాలిని కుక్క గాయపర్చగా ఆమె ఎంజీఎంలో చికిత్స చేయించుకుంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ రెండు గ్రామాల్లో ఉంటున్న కొన్ని కుక్కలు వాహనాలను సైతం వెంబడిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు గ్రామాల్లో రాత్రివేళల్లో దాడి చేసి గొర్ల, మేకలను చంపేశాయి. అలాగే లేగదూడలపైనా దాడి చేసి చంపిన ఘటనలున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యేను అవమానించడం తగదు



నిరసన తెలుపుతున్న నాయకులు రవీందర్, తదితరులు

వర్ధన్నపేట : పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కల్యాణంలో మాజీ ఎమ్మెల్యే, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ను అవమానించడం తగదని, ఘటనపై విచారణ చేయించాలని ప్రజాసంఘాల నాయకులు మిద్దెపాక రవీందర్, జన్ను రాములు, జన్ను నర్సయ్య, జక్కి శ్రీకాంత్, తుమ్మల రవీందర్, తుమ్మల శ్రీధర్, ఐత రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, శ్రీధర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

స్థానిక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు అవమానం జరిగిందంటూ బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ కొండేటి బాబు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు పాలెపాక లూథర్ సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీధర్‌ను దళితుడనే కోణంలోనే వేదిక మీదకు ఆహ్వానించకుండా అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించి అహంకారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. బాధ్యులైన సమ్మెట శ్రీనివాస్, అధికారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు ప్రతులను ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషనర్‌కు, మానవ హక్కుల కమిషన్‌కు, వరంగల్ పోలీస్ కమిషనర్‌కు, వర్ధన్నపేట అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌కు పంపినట్టు బాబు, లూథర్ తెలిపారు.



ఎస్సై చందర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కలెక్టర్‌కు..

మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు జరిగిన అవమానంపై దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుమారస్వామి కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

పర్వతగిరి : వరంగల్‌లో ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ మోసపూరిత పాలన నుంచి ప్రజలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు.

సృజనాత్మకతతో విద్యార్థుల ఉన్నతి

- ఎంఈఓ లింగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లింగారెడ్డి

పర్వతగిరి : సృజనాత్మకత పెంచుకుంటే విద్యార్థులు ఉన్నతి సాధించగలరని ఎంఈఓ గాయపు లింగారెడ్డి తెలిపారు. ట్విన్నింగ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రోళ్లకల్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు కొంకపాక హైస్కూల్‌ను సోమవారం సందర్శించారు. స్కూల్‌లోని సైన్స్, స్పోర్ట్స్ ల్యాబ్‌లతోపాటు కంప్యూటర్, ఇతర వసతులను పరిశీలించి అవగాహన పెంచుకున్నారు. అనంతరం హైస్కూల్ హెచ్‌ఎం భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ లింగారెడ్డి మాట్లాడారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హైస్కూల్‌లోని వసతులు, వాతావరణాన్ని ముందస్తుగా పరిచయం చేసేలా కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రోళ్లకల్, సోమారం, అనంతారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేశ్‌బాబు, నారాయణరెడ్డి, శివశంకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ తవ్వకాలు



సంగెం : మండలంలోని కాట్రపల్లి ఊర చెరువులో అనుమతులు లేకుండా అక్రమార్కులు మొరం తవ్వారు. జేసీబీ, ట్రాక్టర్లతో మొరంను కాట్రపల్లి శివారులోని రోడ్డు నిర్మాణానికి తరలించగా ఐబీ శాఖ ఏఈ హామీద్ తవ్వకాలు నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపట్టవద్దని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువులు, కుంటల్లో మొరం తవ్వకాలు చేపట్టితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

స్కూల్ కిటికీల ధ్వంసం

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూల్ కిటికీలు ధ్వంసం అయ్యాయి. ఈనెల 5, 6 తేదీల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతుండగా నాలుగు గదులకు చెందిన కిటికీలు ధ్వంసం అయినట్టు తెలుస్తోంది. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం ఎలగొండ రామస్వామి మీడియాకు తెలిపారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

పర్వతగిరి : డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని రావూరు–కల్లెడ గ్రామాల మధ్య సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. అన్నారం నుంచి వరంగల్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు మట్టి లోడ్‌తో వస్తున్న టిప్పర్ లారీకి అనూహ్యంగా వేగంతో ఎదురుగా వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ షరీఫ్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును పొలాల్లోకి మళ్లించగా బండరాయిని తాకి ఆగిపోయింది. లారీని ఢీకొని ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదంటూ డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

జెడ్పీ స్కూల్‌లో 'ఇగ్నైట్'

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో బిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం ఇన్‌స్పైరింగ్ గర్ల్స్ ఇన్ న్యూ ఇన్నోవేషన్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఇగ్నైట్) కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక విద్య పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

నల్లబెల్లి : మహారాష్ట్రలోని ముంబాయికు తరలిస్తున్న సుమారు రూ.10 లక్షల విలువైన 21 కిలోల ఎండు గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. వివరాలిలా.. మండలంలోని నారక్కపేటలోని జాతీయ రహదారిపై ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా బాంబేకు చెందిన ప్రవీణ్, వర్ష గంజాయితో పట్టుబడ్డారు. రైలులో ఒరిస్సాలోని బరంపూర్‌కు వెళ్లి సుమారు ఎండు గంజాయి కొనుగోలు చేసి రైలులో బరంపూర్ నుంచి మహబూబాబాద్ మీదుగా ముంబాయి తీసుకెళ్తున్న క్రమంలో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలుసుకొని ప్యాసింజర్ వాహనంలో వెళ్తుండగా పోలీసులు వాహనాల తనిఖీ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై గోవర్ధన్‌ను వివరణ కోరగా నిందితులను విచారిస్తున్నట్లు చెప్పారు.

నల్లబెల్లం, పటిక..



నెక్కొండ : బెల్లం, పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని సీతారాంపురంలో సోమవారం చేటుచేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మండలంలోని దీక్షకుంట వైపు సీతారాంపురం శివారులో ఉదయం పోలీసులు పెంట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన గూడ్స్ వాహనాన్ని పోలీసులు సోదా చేశారు. డ్రైవర్ పారిపోగా వాహనంలో సుమారు రూ.9,07,550 విలువైన 2250 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పటిక లభ్యమైంది. వాహనంతోపాటు బెల్లం, పటికను సీజ్ చేశామని ఎస్సై చెప్పారు.

గుడుంబా..



వర్ధన్నపేట : స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాయపర్తి మండలంలో ఐదు లీటర్ల గుడుంబాతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని బానోతు మంజుల, బానోతు ప్రవీణ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆ శాఖ సీఐ స్వరూప తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం వాహన తనిఖీలు చేపట్టగా బైక్‌పై గుడుంబా రవాణా చేస్తున్న మంజుల, ప్రవీణ్ పట్టుబడ్డారు. వారి నుంచి ఐదు లీటర్ల గుడుంబాతోపాటు బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. తనిఖీల్లో ఆ శాఖ ఎస్సై గంగాధర్, కానిస్టేబుళ్లు వెంకటయ్య, రమేశ్ బాబు, బాబు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విక్రేతల రిమాండ్



గీసుకొండ : బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాకలో పలుమార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడి, ఫైన్ చెల్లించిన గంధ్రకోట విజయ, తేజావత్ సునీతలను పరకాల ఎక్సైజ్ ఎస్సై జ్యోతి సోమవారం హాజరు పర్చగా ఇద్దరినీ రిమాండ్‌కు తరలిస్తూ తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై రూ.14.80 లక్షల పెనాల్టీ విధించినట్టు తెలిపారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో ఇద్దరికి జైలు శిక్ష

నర్సంపేట రూరల్ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానాతోపాటు మూడ్రోజుల జైలు శిక్ష ఖరారైంది. ఈనెల 3న వాహనాల తనిఖీ నిర్వహించగా నెక్కొండ మండలంలోని అమీన్‌పేటకు చెందిన మాలోత్ దేవేందర్, నర్సంపేటలోని కుమ్మరికుంట కాలనీకి చెందిన చాతరాసి సురేశ్ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడగా సోమవారం హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మినారాయణ తీర్పు ఇచ్చారు.

మృతదేహం లభ్యం

పర్వతగిరి : వరంగల్ నగరంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన రెహ్మాన్ (28) మృతదేహం తీగరాజుపల్లి ఎస్సారెస్పీ కాల్వలో సోమవారం ఉదయం లభ్యమైంది. రెహ్మాన్ స్నేహితులతో కలిసి ఆటోలో వచ్చి మద్యం సేవించిన అనంతరం ప్రమాదవశాత్తు కాల్వలో పడి కొట్టుకుపోగా ఆయన ఆచూకీ లభించలేదు. మృతుడి సోదరుడు ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఖానాపురం : ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట రూరల్/ఖానాపురం : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని పర్శనాయక్‌తండాలో, ఖానాపురం మండలంలోని రాగంపేటలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. మధ్యవర్తులు, దళారులకు లంచం ఇస్తే ఇచ్చిన వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్ మోహన్‌రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్లు రాజేశ్, కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సునీల్‌కుమార్, హౌసింగ్ శాఖ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఆరోగ్య పరిరక్షణ కీలకం



ఖానాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

- వైద్యాధికారి సరోజన

నర్సంపేట : సమాజంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ కీలకమని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సరోజన స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజన మాట్లాడారు. వ్యాధుల బారి నుంచి కాపాడుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు వాకింగ్, యోగా వంటివి చేయాలని చెప్పారు. కార్యక్రమాల్లో నర్సింగ్ ఆఫీసర్లు ఎస్తేరు, హేమలత, ఫార్మసిస్ట్ లీలారాణి, హెల్త్ సూపర్‌వైజర్లు రామేల్, కీర్య, సువార్త, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జ్యోతి మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, ఉద్యోగులు దామోదర్‌రెడ్డి, శ్రీనివాసచారి, సవిత తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో ఆరోగ్యం చాలా ముఖ్యమని చెప్పారు. ప్రతిఒక్కరూ చదువుకోవడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భానురేఖ, ఏసీ నారాయణ, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోశయ్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ పోశయ్య

వర్ధన్నపేట : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం, పోలీసు శాఖ కార్యాచరణ చేపడుతోందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోశయ్య తెలిపారు. కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ కోఆర్డినేటర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలన కోసం విద్యార్థులు ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం 'సే నో టు డ్రగ్స్' ప్రచార పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించగా విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్ రెడ్డప్ప, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రజిత మాధవి, స్నేహలత, సంపత్‌రెడ్డి, సంధ్య, సుధ, శ్వేత, జ్యోత్స్న, విష్ణుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్ట్స్, టై, బెల్ట్‌ల అందజేత



టీషర్ట్స్, బెల్ట్‌లు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండలంలోని ఊకల్ స్కూల్ విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం టీ షర్ట్స్, టై, బెల్ట్‌లు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కొత్తూరులో ముదిరాజ్ కులస్తులకు పెద్దమ్మతల్లి ఉత్సవాల నిర్వహణ కోసం రూ.50 వేల సాయం అందజేశారు. తదనంతరం ఇండియన్ పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం వహించిన గాడిపెల్లి ప్రశాంత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ఫౌండేషన్ అధికార ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలం ఏనుగల్‌కు చెందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావును అతడి తల్లి సుభద్రాదేవి ఇటీవల మృతి చెందిన క్రమంలో వరంగల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం పరామర్శించారు. తొలుత సుభద్రాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరావుతో ప్రదీప్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కర్నే రవీందర్, కందిమల్ల మహేశ్, బోరిగం నాగరాజు, ఆకుతోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 7వ వార్డుకు చెందిన దొంగల ఉప్పలమ్మ సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ పట్టణ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, 6వ వార్డు ఇన్‌చార్జ్ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు దూడెల సాంబయ్య, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేరుగు సాంబయ్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాబా, తదితరులు పాల్గొన్నారు.